క్లుప్తంగా

ట్రాఫిక్‌పై సర్వే


వివరాలు అడుగుతున్న సిబ్బంది

పొదలకూరు: ఏపీ ఆర్‌డీసీ ఆధ్వర్యంలో పొదలకూరు పట్టణంలో శుక్రవారం ట్రాఫిక్‌పై సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ని వాహనాలు తిరుగుతున్నాయి, ట్రాఫిక్ రద్దీ తదితర వివరాలను సేకరించారు. ఏపీ ఆర్‌డీసీ నుంచి వచ్చిన యువకులు వాహనాలను ఆపి వివరాలను సేకరించారు. వారు అందజేసే సమాచారం ఆధారంగా రోడ్ల అభివృద్ధి పనులకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందని తెలిసింది.

గ్రామాల్లో ఆంజనేయ స్వామి విగ్రహాల ఏర్పాటు


కనుపర్తిలో ప్రతిష్ఠించిన విగ్రహం

పొదలకూరు: గ్రామాల్లో వీర అభయాంజనేయస్వామి విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. మండలంలో ఇప్పటికే కనుపర్తి, మొగళ్లూరు, కొత్తకంభాలపల్లి, ప్రభగిరిపట్నం, సూరాయపాళెం, కల్యాణపురం, శాంతినగర్, ఆర్‌వైపాళెం తదితర గ్రామాల్లో నిలువెత్తు విగ్రహాల నిర్మాణం పూర్తి చేసి నిత్యం విశేష పూజలు నిర్వహిస్తున్నారు. పొదలకూరులో సైతం అభయాంజనేయస్వామి విగ్రహాన్ని నిర్మించి పూజలు చేయాలనే తలంపుతో భక్తులున్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులు విశేష పూజలు నిర్వహించి, ప్రత్యేక కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేస్తుంటారు. వచ్చే నెల 22న హనుమజ్జయంతి సందర్భంగా మరికొన్ని గ్రామాల్లో అభయాంజనేయస్వామి విగ్రహాలు ముస్తాబవుతున్నాయి.

సాయిబాబాకు విశేష పూజలు



కొడవలూరు: మండలంలోని పద్మనాభ సత్రంలో గల షిరిడీ సాయిబాబా మందిర వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అన్నసంతర్పణను చేపట్టారు. ఆలయ వ్యవస్థాపకుడు ఓడూరు వెంకటేశ్వర్లు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎం అత్యుత్సాహం

కోవూరు: కోవూరు డీఆర్‌డీఏ విభాగంలోని ఏపీఎం అత్యుత్సాహం ప్రదర్శించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని రక్తదాన శిబిరాన్ని శనివారం ఏర్పాటు చేయడమే కాకుండా మండలం నుంచి కనీసం 50 మంది రక్తదాతలను కోవూరు ఎమ్మెల్యే కార్యాలయానికి తీసుకురావాలని వీఓఏలకు టార్గెట్ ఇచ్చారు. ప్రతి వీఓఏ కనీసం ఇద్దర్ని తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించారు.

అప్సా నూతన కమిటీ ఎన్నిక



నెల్లూరు(టీఆర్‌సీసెంటర్): మినీబైపాస్‌లోని యాంపుల్ చిల్డ్రన్స్ అకాడమీలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) జిల్లా నూతన కమిటీ ఎన్నికలను శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి హాజరయ్యారు. జిల్లా అధ్యక్షుడిగా కృష్ణ, ఉపాధ్యక్షులుగా అమీర్‌జాన్, జక్రియా, జనరల్ సెక్రటరీగా శ్రీలక్ష్మి, ట్రెజరర్‌గా నారాయణనాయుడు, ఈసీ మెంబర్‌గా శ్రీనివాసులు ఎన్నికయ్యారు. నెల్లూరు సిటీ, రూరల్, కోవూరు, ఉదయగిరి నియోజకవర్గాలకు నూతన కమిటీలను ఏర్పాటు చేశారు.

రక్తదాన శిబిరం రేపు

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్ సమీపంలోని సాయిదర్బార్ అద్దాల మందిరంలో రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించనున్నామని మందిర మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి శుక్రవారం తెలిపారు. సాయిదర్బార్ యువ సేవాదళ్ సభ్యుడు కనుమూరు సాయినాథ్‌రెడ్డి జ్ఞాపకార్థం కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, రక్తదాతలు 95028 49784, 98663 38933 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

గొంతెండుతోంది..

- వడ్డిపాళెంలో తాగునీటికి కటకట
- నాలుగు రోజులుగా ఇదే దుస్థితి
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

కొడవలూరు: గుక్కెడు తాగునీటి కోసం మండలంలోని పాతవంగల్లు మజరా వడ్డిపాళెం వాసులు నానా అవస్థలు పడుతున్నారు. పిల్లలు, వృద్ధులు, మహిళలనే తేడా లేకుండా దూరంలోని బావి వద్దకెళ్లి చేదుకొని అంత బరువును మోసుకొస్తూ నానా తంటాలు పడుతున్నారు. గ్రామంలో నాలుగు రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పనిచేయని మోటార్లు

వడ్డిపాళెంలో 150 కుటుంబాలున్నాయి. వీరి తాగునీటి అవసరాల నిమిత్తం రెండు మోటార్లు అందుబాటులో ఉండేవి. డైరెక్ట్ పంపింగ్ విధానంలో వీటి నుంచి పైప్‌లైన్ల ద్వారా కుళాయిలకు అందించేవారు. అయితే నాలుగు రోజుల క్రితం ఇవి మరమ్మతులకు గురయ్యాయి. సమస్యను ఆ రోజే సంబంధిత అధికారుల దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. అయినా ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి గ్రామస్తులే స్వయంగా వెళ్లి ఫిర్యాదు చేశారు. సమస్యను శుక్రవారం పరిష్కరిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హామీ ఇచ్చినా, నేటికీ అదే పరిస్థితి.


నీటి కోసం బావి వద్ద తంటాలు

భుజాలు పడిపోతున్నాయి



గ్రామంలోని కుళాయిల్లో నీరు రాకపోవడంతో అంత దూరం వెళ్లి బావిలో చేదుకొని బిందెలను మోసుకొస్తున్నాం. దీంతో భుజాలు పడిపోతున్నాయి. నొప్పులతో రాత్రి వేళ నిద్ర ఉండటం లేదు. మేము ఇంత బాధపడుతున్నా, ఎవరూ పట్టించుకోకపోవడం ఆవేదనకు గురిచేస్తోంది.

– యామాల హరేరామయ్య, వడ్డిపాళెం

నిరంతరం యాతనే..

మోటార్లు మరమ్మతులకు గురవడంతో సుమారు 300 మీటర్ల దూరంలోని బావిని గ్రామస్తులు ఆశ్రయిస్తున్నారు. తాగునీటికే కాకుండా ఇంటి అవసరాలకు సైతం కీలకం కావడంతో మహిళలు, వృద్ధులు, చిన్నారులు బిందెలతో రోడ్డెక్కి అంత దూరం నుంచి మోసుకొస్తూ తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.


మోటార్‌బైక్ వెనుక బిందెలు కట్టి..

అధికారుల నిర్లక్ష్యమే శాపం



తాగునీటి కోసం 150 కుటుంబాల వారు నాలుగు రోజులుగా నానా అవస్థలు పడుతున్నా, అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండటం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. సర్వసభ్య సమావేశంలో ఫిర్యాదు చేస్తే సమస్య పరిష్కారమవుతుందని భావించాం. అయినా గ్రామంవైపు కన్నెత్తి చూడకపోవడం దారుణం

– వల్లెపు వెంకటేశ్వర్లు, వడ్డిపాళెం

వైఎస్సార్సీపీ నేతలతో సమావేశం



కోవూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోవూరు నియోజకవర్గ మహిళా సమన్వయ కమిటీ సభ్యులతో సమావేశాన్ని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నెల్లూరులోని తన నివాసంలో శుక్రవారం నిర్వహించారు. పార్టీ బలోపేతానికి ఎలాంటి చర్యలు చేపట్టాలో తెలియజేశారు. డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు, ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, పార్టీ రైతు విభాగ జిల్లా అధ్యక్షుడు పూండ్ల అచ్యుత్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షులు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, చెర్లో సతీష్‌రెడ్డి, షాహుల్, అత్తిపల్లి అనూప్‌రెడ్డి, శివుని నరసింహారెడ్డి, శేషగిరి, నేతలు కోడూరు వెంకటసుబ్బారెడ్డి, కలువ బాలశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని ఆశ్రమ పాఠశాలలో 2025 – 26 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని నిర్వాహకుడు ప్రకాష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలబాలికలకు ప్రత్యేకంగా హాస్టల్ వసతి ఉందన్నారు. జిల్లాకు చెందిన వారే అర్హులని వివరించారు. వినికిడి లోపం ఉంటే పాఠశాల బదిలీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీతో పాఠశాలను సంప్రదించాలని కోరారు. వివరాలకు 99893 46709, 92486 51399 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

21 నుంచి ఆధార్ స్పెషల్ క్యాంపులు

వెంకటాచలం: ఎస్టీల కోసం ఈనెల 21 నుంచి 26 తేదీ వరకు మండలంలోని పలు గ్రామాల్లో ఆధార్ స్పెషల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కల్పన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చాలా మంది ఎస్టీలకు ఆధార్ లేకపోవడంతో ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారని, వారి కోసం ఈ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. 21న చెముడుగుంట, కాకుటూరు గ్రామాలకు కలిపి చెముడుగుంట సచివాలయంలో, 22న అనికేపల్లి, కంటేపల్లి గ్రామాలకు గొలగమూడి సచివాలయంలో, సర్వేపల్లి, తిక్కవరప్పాడు గ్రామాలకు సర్వేపల్లి సచివాలయంలో, 23న నిడిగుంటపాళెం, ఇస్కపాళెం, తాటిపర్తిపాళెం, పంజులూరుపాడు గ్రామాలకు నిడిగుంటపాళెం సచివాలయంలో, 24న కసుమూరు, కందలపాడు, పాలిచెర్లపాడు, కురిచెర్లపాడు గ్రామాలకు కసుమూరు సచివాలయంలో, గుడ్లూరువారిపాళెం, తిరుమలమ్మపాళెం, పూడిపర్తి, ఎగువమిట్ట గ్రామాలకు గుడ్లూరువారిపాళెం సచివాలయంలో, 25న ఇడిమేపల్లి, ఈదగాలి గ్రామాలకు ఇడిమేపల్లి సచివాలయంలో, 26న వెంకటాచలం, చవటపాళెం గ్రామాలకు వెంకటాచలం సచివాలయంలో, కసుపూరు గ్రామ పరిధిలోని ఎస్టీలకు కసుపూరు సచివాలయంలో క్యాంపులు నిర్వహిస్తామని, ఆధార్ కార్డులు లేనివారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాలి

పొదలకూరు: మండలంలోని ప్రతి పంచాయతీలో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాలని ఎంపీడీఓ డీవీ నరసింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాల్సిందిగా సూచించారు. కార్యక్రమాన్ని ఫొటోలు తీసి వాట్సాప్‌లో అప్‌లోడ్ చేయాల్సిందిగా పేర్కొన్నారు.

ఎమ్మెల్యే పర్యటన

వెంకటాచలం: సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మండలంలోని రామదాసుకండ్రిగ, నాయుడుపాళెం గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఆయన వెంట పలువురు అధికారులు, టీడీపీ నాయకులు న్నారు.

గ్యాస్ గోదాము వద్ద అవగాహన



పొదలకూరు: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని గ్యాస్ గోదాము, పెట్రోల్ బంకు వద్ద అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఎస్ఎఫ్ఓ విజయ వరకుమార్ పర్యవేక్షణలో సిబ్బంది డెమో ఇచ్చారు. ప్రమాదం జరిగిన సమయంలో మంటలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక ఉద్యోగులు, గ్యాస్ గోదాము, పెట్రోల్ బంకు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల స్పెషల్ డ్రైవ్

- డ్రంక్ అండ్ డ్రైవ్‌పై 27 కేసులు నమోదు
- కత్తితో పట్టుబడిన యువకుడి అరెస్ట్
- మరో నిందితుడి కోసం గాలింపు

నెల్లూరు(క్రైమ్): నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ చర్యల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్‌ను పోలీస్ అధికారులు గురువారం రాత్రి నుంచి అర్ధరాత్రి వరకు నిర్వహించారు. ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారి ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, శివారు ప్రాంతాల్లో వాహన తనిఖీలను చేపట్టారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రికార్డులు సక్రమంగా లేని 15 వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై 75 కేసులు నమోదు చేసి రూ.68,420 అపరాధ రుసుము విధించారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న 27 మందిపై కేసులు నమోదు చేశారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న పలువుర్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ సౌజన్య మాట్లాడారు. నేరాలను నియంత్రించి ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలను అందించాలనే ఇన్‌చార్జి ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు తనిఖీలను నిర్వహించామన్నారు.


వాహన తనిఖీలు నిర్వహిస్తున్న చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు

కత్తితో పట్టుబడిన యువకుడు

నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్ వద్ద వాహన తనిఖీలను చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్సై అయ్యప్ప చేపట్టారు. స్కూటీపై వస్తూ పోలీసులను చూసి ఇద్దరు వ్యక్తులు పరారవుతుండగా ఎస్సై వారిని వెంబడించారు. ఓ వ్యక్తి పరారవ్వగా, నాయబ్‌ను పట్టుకున్నారు. స్కూటీని తనిఖీ చేయగా, అందులో కత్తి ఉండటంతో దాన్ని స్వాధీనం చేసుకొని నాయబ్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారించారు.

నగదును దోచుకునేందుకే..

బుచ్చిరెడ్డిపాళెంలోని ఖాజానగర్‌కు చెందిన నాయబ్ ఐటీఐ వరకు చదువుకున్నారు. సీఆర్పీ డొంకలో ఏడేళ్లుగా ఉంటూ ఓ ప్రైవేట్ లైఫ్ ఇన్సురెన్స్ కంపెనీలో కలెక్షన్ ఏజెంట్‌గా పని చేస్తూ మద్యానికి బానిసయ్యారు. ఈ క్రమంలో బాలాజీనగర్‌కు చెందిన దేవాతో పరిచయమై స్నేహితులయ్యారు. సంపాదన మొత్తం తాగేందుకే వెచ్చించసాగారు. దీనికి సరిపడా నగదు లేకపోవడంతో రోడ్లపై వెళ్లేవారిని కత్తితో బెదిరించి నగదు దోచుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగానే స్కూటీపై గురువారం వస్తుండగా, గాంధీబొమ్మ వద్ద పోలీసులను చూసి పరారయ్యేందుకు యత్నించారు. దేవా తప్పించుకోగా, పోలీసులకు నాయబ్ చిక్కారు. దీంతో ఆయన్ను శుక్రవారం అరెస్ట్ చేశామని, పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నామని ఇన్‌స్పెక్టర్ చెప్పారు.

పేదింటి బిడ్డ.. చదువులో దిట్ట


తల్లిదండ్రులతో దీక్షింత్

మనుబోలు: రెక్కాడితే గానీ డొక్కాడని బతుకులు వారివి. పనిచేస్తేనే రోజు గడుస్తుంది. అలాంటి కుటుంబంలో జన్మించి ప్రభుత్వ వసతి గృహంలో ఉంటూ ఇంటర్ మొదటి సంవత్సరం చదివిన ఆ బాలుడు అత్యధిక మార్కులు సాధించాడు. వివరాలిలా ఉన్నాయి. మనుబోలు దళితవాడకు చెందిన నవకోటి మజుందర్, అరుణ దంపతులకు దీక్షింత్ అనే కుమారుడున్నాడు. మజుందర్ చిన్న చిన్న పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బాలుడు పదో తరగతి వరకూ మనుబోలు ప్రభుత్వ పాఠశాలలో చదివాడు. ఇంటర్మీడియట్‌ను దొరవారిసత్రం మండలంలోని గురుకుల పాఠశాలలో చదువుతున్నాడు. ఇటీవల వెలువడిన మొదటి సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీలో 470 మార్కులకు గానూ 463 మార్కులు సాధించాడు. చదువుకు పేదరికం అడ్డుకాదని దీక్షింత్ నిరూపించాడు.

శివపార్వతులకు వైభవంగా ఏకాంతసేవ


విద్యుద్దీపాలంకరణలో శివాలయం

మనుబోలు: సంగమేశ్వర బ్రహ్మోత్సవాల్లో భాగంగా శివపార్వతులకు ఏకాంతసేవను గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా శివాలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. అర్చకులు సర్వేపల్లి ఫణీంద్ర శర్మ, సాయిశర్మలు నూతన దంపతులైన శివపార్వతులకు అభిషేకాలు నిర్వహించి పట్టువస్త్రాలు ధరింపజేసి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. 9 రకాల పండ్లు, 9 రకాల స్వీట్లు నైవేద్యంగా ఉంచి శాస్త్రోక్తంగా ఏకాంతసేవను జరిపారు. ఉభయకర్తలుగా మనుబోలు ఆర్యవైశ్య సంఘం వారు వ్యవహరించారు. ఆలయం వద్ద పీజీఎం ఈవెంట్స్ ఆధ్వర్యంలో జరిగిన మ్యూజికల్ నైట్ ఆకట్టుకుంది. ఉత్సవ కమిటీ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.


ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవారు

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే


మనుబోలు: ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ఇందుకూరుపేట: గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మండంలోని ఇందుకూరుపేట, కొత్తూరు, నిడిముసలి, ముదివర్తిపాళెం, కుడితిపాళెం, రాముడుపాళెం, గంగపట్నం, మైపాడు, కొరుటూరు, సోమరాజుపల్లి, కొమరిక, నరసాపురం తదితర గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.


మనుబోలు: సందేశాన్ని వినిపిస్తున్న పీటర్‌పాల్

- కోవూరు: మండలంలో గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పట్టణంలోని శారా బిలాక్ మెమోరియల్ సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ రెవరెండ్ దావులూరి రాజేష్, చైర్మన్ కాకాణి రత్నానందరావు, వైస్ చైర్మన్ మైలా ఫ్రాన్సిస్, సెక్రటరీ తుమ్మలపెంట మోహన్, కోశాధికారి నావూరు కుమార్, చంద్రశేఖర్, దేవపాల్ పాల్గొన్నారు.
- మనుబోలు: మనుబోలు మండల కేంద్రంలో శుక్రవారం గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. స్థానిక దళితవాడలోని జేఏఎం చర్చిలో పాస్టర్ పీటర్‌పాల్, కోదండరామపురంలోని ప్రేయర్ టవర్ చర్చిలో పాస్టర్ లాజరస్‌లు దైవ సందేశాన్ని వినిపించారు. పెద్ద సంఖ్యలో క్రైస్తవులు చర్చిల్లో ప్రార్థనలు చేశారు.
- ముత్తుకూరు: మండలంలోని ముత్తుకూరులో ఉన్న శియోనియం బాప్టిస్ట్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. కార్యక్రమంలో పాస్టర్ కేటీ పాల్, చర్చి వ్యవస్థాపకుడు బూదూరు అబ్రహం, కమిటీ పెద్దలు బాలు, విన్సెంట్, ప్రసూన, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.
- తోటపల్లిగూడూరు: మండలంలో గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కోడూరు వేళాంగణి మాత చర్చిలో డైరెక్టర్ లూకాస్‌రాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఆయన తన భుజాలపై శిలువను మోస్తూ ప్రధాన వీధుల్లో తిరిగారు.


టీపీగూడూరు: శిలువను మోస్తున్న చర్చి డైరెక్టర్


కోవూరులో..

గ్రామాల్లో ఆధార్ స్పెషల్ డ్రైవ్

మనుబోలు: ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపులను ఎస్టీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జలజాక్షి కోరారు. మనుబోలు మండల కేంద్రంలో శుక్రవారం మనుబోలు, కొమ్మలపూడి, చెరుకుమూడి, ముద్దుమూడి, కాగితాలపూరు, గురివిందపూడి గ్రామాలకు చెందిన ఎస్టీల కోసం ఆధార్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధార్ నమోదు, సవరణల కోసం ఎస్టీలు ఇబ్బందులు పడకూడదని ఐటీడీఏ అన్ని మండలాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


ఆధార్ నమోదు, సవరణలు చేయించుకుంటున్న గిరిజనులు